క్లుప్తంగా

నేను బడికిపోతా.. ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నగరి: 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పట్టణ పరిధిలో ర్యాలీ శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. బాల కార్మికులుగా పనులకు వెళ్లడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వాలు ఇచ్చే సదుపాయాలను వినియోగించుకొని పాఠశాలల్లో చదువుకోవాలని సూచించారు.

రుణాలతో జీవనోపాధి మెరుగుపరచుకోవాలి



మాట్లాడుతున్న ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు ఇస్తున్న వివిధ రుణాలతో జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శనివారం డ్వాక్రా కార్యాలయంలో డ్వాక్రా సంఘా లీడర్లు, సంఘమిత్రలు, సీసీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజి రుణాలను తీసుకుంటున్న డ్వాక్రా సంఘ సభ్యులు ఆదాయం ఎక్కువ వచ్చేలా పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ లోకనాథం, చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, బాలయ్య లీడర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో బతుకులు ఛిద్రం



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీదుర్గయ్య

వెదురుకుప్పం: మత్తు పదార్థాల వాడకంతో యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్ఈబీ సీఐ లక్ష్మీదుర్గయ్య అన్నారు. శనివారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తుపదార్థాల వాడకం-కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో అనేక దుష్పరిణామాలు కలుగుతాయని చెప్పారు. గ్రామాలలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఉభయదారులు

వెదురుకుప్పం: చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో భక్తి ప్రపత్తులతో యజ్ఞ పూజలు చేశారు. వేకువజామునే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. తదుపరి అమ్మవారిని ప్రత్యేక ఆకర్షణీయంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలత హరికథా కాలక్షేపం చేపట్టారు. శనివారం నాటి యజ్ఞపూజకు వైస్ఎంపీపీ రమణసుబ్రమణ్యం కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆదివారం బండికుంభాల కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త రాధారెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజయరెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు వినాయకస్వామికి అభిషేకాలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం పలు సేవలు, అభిషేకాలు జరగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 4.30 నుంచి 5 గంటల వరకు సుప్రభాతసేవ ఉంటుందన్నారు. అలాగే 6 నుంచి 6.30 గంటల వరకు గణపతి సహస్రనామార్చన, ఉదయం 5 గంటలకు, 9 గంటలకు, 11 గంటలకు ప్రత్యేక అభిషేకం, ఉదయం 7.30, సాయంత్రం 5.30 గంటలకు పాలాభిషేకం ఉంటుందన్నారు. ఈ సమయంలో ఉచిత సేవలు ఉండవని వారు పేర్కొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం

- వర్షాకాలం.. వ్యాధుల ప్రమాదం
- గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాప్తి అధికం
- పశుసంవర్ధక శాఖ ఏడీ వాసు





నగరిపేటలో గొంతువాపు పరిశీలించి టీకాలు వేస్తున్న పశువైద్యులు, పానగల్లు గ్రామంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

నగరి: వర్షాకాలంలో పాడి, పశు పోషణ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ సారి సీజన్ మొదట్లోనే విస్తారంగా వర్షాలు పడుతుండడం శుభపరిణామమని చెబుతున్నారు. పశుగ్రాసానికి ఇబ్బంది ఉండదన్నారు. అయితే పశుసంరక్షణ విషయంలో మాత్రం అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో సాధారణంగా పశువుల్లో గొంతు వాపు, జబ్బవాపు, పాదుగువాపు, చిటుకురోగం, గాలికుంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటి నివారణకు అన్ని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రుల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. పాడి రైతులు పశు వైద్యులు, గోపాలమిత్రలను సంప్రదించి టీకాలు, వైద్య సహాయం తీసుకోవాలి.

వ్యాధులు–లక్షణాలు

గేదెల్లో వచ్చే ప్రధాన వ్యాధుల్లో గొంతువాపు ముఖ్యమైనది. అరుదుగా ఆవులకు కూడా వ్యాపిస్తుంది. బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి కలుషితమైన గడ్డి, నీరు వల్ల వ్యాప్తి చెంది, ఒకదాని నుంచి మరొకదానికి విస్తరిస్తుంది. వ్యాధి బారిన పశువుకు అధిక జ్వరం, గొంతు కింద వాపు, మేత మేయకపోవడం, పాలు తగ్గడం, శ్వాస సరిగా తీసుకోలేక చివరకు మృత్యువాత పడే ప్రమాదముంది. లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలి. ఆవు జాతి పశువుల్లో జబ్బవాపు ఎక్కువగా వస్తుంది. ఇది కూడా కలుషిత గడ్డి, నీరు కారణంగా బ్యాక్టీరియా వ్యాప్తి చెంది విస్తరిస్తుంది. అధిక జ్వరం, తొడ, జబ్బ కండరాల్లో వాపు వచ్చి ఆయా ప్రాంతాలు కుళ్లిపోతాయి. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కేవలం మూడు నాలుగు రోజుల్లోనే మత్యువాతపడే అవకాశం ఉన్నందున ముందస్తుగా టీకాలు వేయించాలి.

వైరస్ కారణంగా ఆవులు, గేదెల్లో గాలికుంటు వ్యాధి ప్రబలుతుంది. దీనినే నోటిపుండ్లు, గిట్ట పుండ్ల వ్యాధిగా పిలుస్తారు. అధిక జ్వరంతో బాధపడుతాయి. నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. మేత సక్రమంగా తినలేక పాల దిగుబడి తగ్గిపోతుంది. కలుషిత మేత, నీరు, గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. మరణాల శాతం తక్కువగా ఉన్నా పాడి తగ్గిపోవడం, పునరుత్పత్తిపై ప్రభావం చూపించే ప్రమాదం ఉంది.

వర్షాకాలంలో సాధారణంగా పిడుదులు, గోమార్ల నుంచి బేబిసియా, థయేలేరియా, అనాప్లాస్మా లాంటి వ్యాధులు సంభవిస్తాయి. వర్షాకాలంలో సాధారణంగా షెడ్లలోనే ఎక్కువ సమయం ఉండడం వల్ల పాదుగు వాపు వచ్చే అవకాశం ఉంటుంది. షెడ్లలో తేమ లేకుండా పొడి వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పాలు పిండిన వెంటనే కనీసం అరగంట తర్వాత వరకు పడుకోకుండా చూసుకోవాలి.

పశువులు ఎదకు రావడం, పునరుత్పత్తికి వర్షాకాలం అనువైన సమయం, ఎదకు వచ్చిన పశువులు, గేదెల పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి. ఇక పశుగ్రాసం సమస్య తలెత్తకుండా పొలాలు, పొలం గట్ల మీద, షెడ్ల పరిసరాల్లో సుబాబుల్, అవిశెతో పాటు ధాన్యపు జాతి, కాయ జాతి పశుగ్రాసాలను పెంచాలి. ఎండుగడ్డితో పాటు పచ్చి గడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకుంటే పశుపోషణ అత్యంత లాభదాయకంగా ఉంటుంది.

నియోజకవర్గంలో పశువుల వివరాలు ఇలా

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
నగరి	12200	1500	10000	15000
పుత్తూరు	9700	1200	8000	12000
విజయపురం	4200	700	3000	6000
నిండ్ర	3700	600	2700	4500
వడమాలపేట	2400	300	2000	3000

జాగ్రత్తలు పాటించాలి



వర్షాకాలంలో పశువుల పాక వద్ద శుభ్రత లోపిస్తుంది. దీంతో పశువులకు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది. కావున పాడి రైతులు పశువులను జాగ్రత్తగా చూసుంటూ వాటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి. గొంతువాపు వ్యాధికి టీకాలు వేస్తున్నాం. ఇప్పటికే వెయ్యి పశువులకు పైగా టీకాలు వేశాం. పశువుల ఆరోగ్యం పట్ల ఎటువంటి అనుమానం ఉన్నా పాడి రైతులు దగ్గరలోని పశువైద్యులను కలిసి సలహాలు తీసుకోవాలి. –వాసు, పశుసంవర్ధక శాఖ, ఏడీ, నగరి

గజేంద్రుడిపై కోదండరాముడి విహారం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముల దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజేంద్రుడిపై శ్రీరాముడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం వేదపండితులచే ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేయించారు. అనంతరం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. సాయంకాలం ఊంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గజ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలు, వివిధ రకాల ప్రసాదాలతో మంగళవాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు, అర్చలు చేయించి నైవేద్యం సమర్పించారు. గజేంద్రుడిపై కొలువుదీరిన శ్రీరాముడు పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి



ఏఐటీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: అధికార మార్పిడి జరిగిన ప్రతిసారీ కార్మికులను మార్చాలనుకోవడం అవివేకమని, కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షులు నాగరాజు అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ సభ్యుల సమావేశంలో మారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలో వంట కార్మికులను మార్చాలని కొంతమంది కొన్ని ప్రాంతాల్లో ఒత్తిడి తీసుకొని రావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారం చేపట్టిన వెంటనే కొంతమంది చోటా నాయకులు స్థానికంగా ఉన్న రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలని పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పెద్దలు స్థానిక ఎమ్మెల్యేలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న స్థానిక నాయకులను కార్మికుల జోలికి వెళ్లకుండా చూడాలని ఏఐటీయూసీ తరఫున కోరుతున్నామన్నారు. అంగన్‌వాడీలకు జీతాలను పెంచాలన్నారు. పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పూర్తికాని అంగన్‌వాడీ భవనాలను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చిత్తూరుకు వెళ్లి డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి నాయకులు రఘు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ, జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, జిల్లా నాయకులు శాంతి, అరుణ రాధమ్మ, రమాదేవి, రాధా, ఝాన్సీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం




మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.రామనాథరెడ్డి

పాలసముద్రం: వాతావరణం మార్పులతో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.రామనాథరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీర్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదించిన ఔషధం.. అల్ల నేరేడు

- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి దివ్య ఔషధం
- నేరేడు పండ్లు శరీరానికి చలువ



విక్రయానికి సిద్ధంగా ఉంచిన అల్ల నేరేడు

ఐరాల: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలు సీజన్ల వారీగా తినాల్సిందే. అయితే ప్రకృతి ప్రసాదించే పండ్లలో అల్లనేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేసి శరీరానికి చలువను ఇస్తాయి. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లు చూసేందుకు నల్లగా నిగనిగలాడుతాయి. తింటే వగరు, తీపి, పుల్లగా ఉంటాయి. మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ఎంతో కీలకంగా ఉంటాయి. నేరేడు పండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్న పని. అల్ల నేరేడు కేజీ రూ.100 నుంచి రూ.150 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు దూరమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే అల్ల నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకే నేరేడు పండ్లను ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని పండ్ల దుకాణాల వద్ద, బండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.

పోషకాలు ఎన్నో..

అల్ల నేరేడు పండ్లలో ఔషధగుణాలు మెండుగా ఉంటాయి. రుచి కూడా అద్భుతం. ఈ పండులో క్యాల్షియం, ఐరన్, పొటాషియం, విటమిన్ సి, తరచుగా తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం, అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది. అల్ల నేరేడు పండ్లలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవీ శరీరంలో అనేక రుగ్మతలను నివారిస్తాయి. సంపూర్ణ ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

ఆరోగ్యానికి ఎంతో మేలు

అల్ల నేరేడు పండు శరీరానికి ఎంతో మంచిది. వీటితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనిషిలోని పలు రకాల వ్యాధుల నివారణకు ఈ పండు ఎంతగానో దోహదపడుతుంది. వీటిని నానబెట్టి నీరు తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు.

– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

శ్రీలక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో లక్ష్మీ నరసింహ స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుంగధ పరిమళాలతో కూడిన వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చిన స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

- ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి
- మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు: వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి సూచించారు. స్థానిక మెయిన్ స్కూల్లో శనివారం అంగన్‌వాడీ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కారణంగా కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై ప్రజలు డయేరియా, వైరల్ ఫీవర్స్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, మెడికల్ ఆఫీసర్ రమేష్, సీడీపీఓ పద్మజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాంజలి, సంధ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు

అతిసారం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్న జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకులను క్లోరినేషన్‌తో శుభ్రపరిచారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని వర్కర్లకు సూచించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమాలను కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.



పుత్తూరులో ట్యాంకును శుభ్రపరుస్తున్న మున్సిపల్ కార్మికుడు

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఫ్రిడ్జిల్లో నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. మంచి నీటిని కాచి వడబోసి త్రాగాలి.
- దోమతెరలను వినియోగించాలి.
- ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పల్లో, కూలర్లలో, రోళ్లలో, రిఫ్రిజిరేటర్లలో, పాతటైర్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి.
- చెత్తను రోడ్లపైన, కాల్వల్లో వేయరాదని, మున్సిపల్ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు వారి చేతికి అందివ్వాలన్నారు.
- డయేరియా, జ్వరాల బారిన పడినపుడు సొంత వైద్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. ప్రత్యేకించి విరేచనాలు అయినప్పుడు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

వడమాలపేటలో..

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా మెలగాలని సీడీపీఓ సూచించారు. వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు, సిరప్ అందుబాటులో ఉంచుకొని అవసరమైన వారికి అందించాలని సూచించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి హన్నాహన్ను, సీహెచ్ఓ పురుషోత్తంరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రోజారమణి, ఆరోగ్య పర్యవేక్షకులు చంద్రమోహన్, ఆశా తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరులో మాట్లాడుతున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి





వడమాలపేటలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మజ, ఉత్తరపుకండ్రిగలో ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రపరుస్తున్న కార్మికుడు